

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

'ఏఐవైఎఫ్' పోస్టర్ ఆవిష్కరణ

» మార్చి 1, 2న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మార్చి 1, 2వ తేదీలలో నగరంలోని ఈసీఐఎల్‌లో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై సమావేశాల్లో పలువురు వక్తల ప్రసంగిస్తారని వివరించారు. మొదటిరోజు సాంకేతిక, అభివృద్ధి, నిరుద్యోగ సమస్యలపై చర్చలు జరపనున్నట్లు తెలిపారు. రెండోరోజు ప్రధానంగా యువత పెడదారిలో పయనించడానికి గల కారణాలు, నేటి సమాజంలో సాంకేతికత ప్రభావం వంటి అనేక అంశాలపై మేధావుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి.సత్యం, మండల కార్యదర్శి శివ, వెంకటేశ్వర్లు, యేసుబాబు, సంపత్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

» డీఎంహెచ్‌వో ఉమాగౌరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ఉమాగౌరి

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్యాధికారి సి.ఉమాగౌరి వైద్యులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీసర, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్యారోగ్య అధికారులు, జిల్లా ఆరోగ్య కార్యక్రమ అధికారులు, జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్‌లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు నమ్మకం కల్గించే విధంగా పనిచేయాలని తెలిపారు.



ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

వికారాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించి ఆమోదించాలని, పేదలు, కార్మికులు, కర్షకులతో పాటు విద్య, వైద్యరంగానికి అనుకూలంగా లేదని, సంపన్న వర్గాలకు మేలు చేసేలా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకురాలు వై.గీతలు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడా కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా.. పేదలు, కార్మిక, కర్షకులపై భారం వేసేలా బడ్జెట్ ఉండడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు రామకృష్ణ చంద్రయ్య, సతీష్, సుదర్శన్, నవీన్, శ్రీకాంత్, యాదయ్య, శ్రీను నాయక్, రజాక్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



దండిగా ఉపాధి

జాబ్ కార్డులు ఉన్న అందరికీ అవకాశం

ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచేలా కసరత్తు

ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా చర్యలు

జిల్లాలో ఇప్పటికే 59.45 లక్షల పని రోజులు పూర్తి

మార్చి 31 నాటికి 7.55 లక్షల పని రోజులు పూర్తి చేసేలా లక్ష్యం

6

ఉపాధిహామీ పనుల్లో వేగం, కూలీల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం మరింత కసరత్తు చేస్తోంది. జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈమేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిర్దేశించి లక్ష్యాన్ని చేరుకునేందుకు.. గడువులోగా పనులు పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది.



వికారాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వ్యవసాయ పనులు చివరి దశకు చేరుకోవడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఉపాధిహామీ పనుల్లో వేగం పెంచేవిధంగా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఎండలు ముదరడంతో ఉపాధిహామీ పనులపై దృష్టి సారించారు. ప్రస్తుతం అంతంత మాత్రంగానే కొనసాగుతున్న పనులకు ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా ప్రోత్సహించి ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పని రోజుల లక్ష్యం అధిగమించాలన్న లక్ష్యంతో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. వచ్చే రెండున్నర నెలల పాటు జిల్లాలో ఎంతమంది కూలీలకు పనులు కల్పించాలి.. కూలీలతో ఏయే పనులు చేపట్టాలనే విషయమై సంబంధిత అధికారులు ఇది వరకే ప్రణాళికలు రూపొందించారు. అంతేకాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కూడా కూలీలకు ఎక్కువ సంఖ్యలో పనులు కల్పించేలా ఇప్పటినుంచే కసరత్తు చేస్తున్నారు.

45 రోజులు.. 7.55 లక్షల పనిరోజులు

జిల్లాలో 18 మండలాల పరిధిలో 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో 1,86,044 జాబ్ కార్డులు జారీ చేయగా.. 377176 మంది కూలీలుగా నమోదయ్యారు. కాగా, జిల్లాలో 1,30,847 జాబ్ కార్డుల్లో నమోదైన 2,43,714 కూలీలు ఉపాధి హామీ

మిగతా 8వ పేజీలో...

మారెపల్లిలో సుద్ద మాఫియా

- భారీగా అక్రమ తవ్వకాలు
- సుద్ద డంప్‌లను గుర్తించిన మైన్స్, రెవెన్యూ అధికారులు

7

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

» ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులు లేకుండా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ అధికారులతో ఆయన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని, ఆన్‌లైన్‌లో కూడా ఎలాంటి ఫైళ్లు పెండింగ్‌లో ఉంచకూడదని పోలీస్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా యూఐ కేసులు, ఎన్‌బీడబ్ల్యూఎస్, పాత పెండింగ్ కేసులు, పీవో సీఎస్‌వో, ఎస్సీ, ఎస్టీ, ఎన్‌డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కోర్టు డ్యూటీ అధికారులతో సమన్వయం పెంచుకొని కేసుల తీర్పులోకన్విక్షన్ శాతాన్ని మెరుగు పర్చాలని సూచించారు. పోలీస్ అధికారులు ప్రతీ శనివారం తమ స్టేషన్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలకు గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల్లో సీసీ కెమెరాల వినియోగంపై అవగాహన పెంచాలని, చోరీ కేసులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌ను పోలీసులు నిర్లక్ష్యం చేయకూడదని, ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. ప్రజలకు రక్షణ కల్పించడమే ప్రథమ కర్తవ్యమని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీవీ హన్మంత్‌రావు, తాండూరు, పరిగి, వికారాబాద్ డీఎస్పీలు, డీసీఆర్‌బీ డీఎస్పీ, ఏఆర్‌డీఎస్పీ, జిల్లా సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై 'ఎండిన చెట్టు'

ధారూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ధారూరు-వికారాబాద్ మార్గంలోని అల్లీపూర్ గేట్ వద్ద రోడ్డుపై మంగళవారం ఉదయం ఎండిన చెట్టు కూలిపోయింది. రోడ్డు పై అడ్డంగా పడటంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సమాచారం అందుకున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్టును తొలగించి పక్కకు తీశారు. దాంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగాయి.



అల్లీపూర్ గేట్ వద్ద రోడ్డుపై పడిపోయిన చెట్టు



ఆమనగల్లు రైతు దీక్షలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నిజాయితీ గల మోసగాడు

సీఎం రేవంత్

హామీలపై కాంగ్రెసోళ్లను గల్లా పట్టి నిలదీయాలి

రాష్ట్రంలో అన్నివర్గాలను దగాచేసిన కాంగ్రెస్

కొడంగల్‌తో పాటు కల్వకుర్తి ప్రజలను మోసగించిన సీఎం

కాంగ్రెస్ విధానాలతో దెబ్బతిన్న రియల్ ఎస్టేట్

మళ్లీ మొదలైన రైతుల, విద్యార్థుల, చేనేత కార్మికుల ఆత్మహత్యలు

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సభకు హాజరైన ప్రజలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి నిజాయితీగల మోసగాడని, మోసంలో ఆయన ఎవరినీ వదలడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుదీక్ష కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెసోళ్లను ఆరు గ్యారంటీలు, 420 హామీలపై గల్లా పట్టి నిలదీయాలని ప్రజలకు సూచించారు. ఓట్లేసి గెలిపించిన కొడంగల్ తోపాటు సొంత నియోజకవర్గమైన కల్వకుర్తి ప్రజలను సీఎం మోసం చేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్‌వ్యాపారం దెబ్బతిందని ఆరోపించారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి రాక ముందు రైతు భరోసా కింద రూ. 15 వేలు రైతులకు, రైతు కూలీలకు రూ. 12 వేలు, మహిళలకు నెలకు రూ. 2500, పింఛన్లు రూ.4వేల నుంచి రూ.6వేలు, యువతులకు స్కూటీలు, ఆడపిల్లల వివాహానికి తులం బంగారం ఇస్తామని ఇలా అందరినీ మోసగించిన ఘనత రేవంత్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ పాలనలో లూటీలే తప్ప స్కూటీలు లేవని ఎద్దేవా చేశారు. మూడెకరాల లోపు ఉన్నవారికి రైతుబంధు వేశామని ప్రభుత్వం చెబుతున్నా పది శాతం మందికీ అందలేదని, రూ.2 లక్షల రుణమాఫీ సగం మంది కూడా జరగలేదన్నారు. రైతులకు ఎకరాకు రూ. 17,500 చొప్పున రేవంత్ సర్కార్ రైతుబంధు

మిగతా 7వ పేజీలో...

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

» భక్తులకు ఇబ్బంది కలిగించొద్దు

» అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

» అధికారులతో సమీక్ష

» కీసరగుట్ట రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు ఆన్‌లైన్ సేవలు



ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న విజయేందర్‌రెడ్డి

కీసర, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి కీసరగుట్ట రామలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బ్రహ్మోత్సవాలపై మంగళవారం కీసరగుట్టలోని కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ నిర్వహకులు, రాజకీయ పార్టీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతరలో నెలకొనే సమస్యలపై చర్చించి పరిష్కారానికి సలహాలు, సూచనలు తీసుకున్న అదనపు కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అలసత్వం వహించకుండా భక్తులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సమన్వయంతో విధులు నిర్వహించి జాతరను విజయవంతం చేయాలన్నారు. అదేవిధంగా లక్షలాది మంది భక్తులు వచ్చే బ్రహ్మోత్సవాలకు ప్రముఖులు కూడా హాజరవుతారని, ప్రొటోకాల్ పాటించి, వీఐపీలకు, సామాన్య భక్తులకు ఇబ్బంది రాకుండా చూసుకోవాలన్నారు. అర్హత ఉన్న వారిని మాత్రమే ప్రొటోకాల్ క్యూలైన్ దర్శనానికి అనుమతించాలని, వారితో పాటు వచ్చే బంధువులకు, ఇతరులకు క్యూలైన్‌లో అనుమతి లేదని కరాఖండిగా తేల్చిచెప్పారు. దానికి ఆలయ నిర్వాహకులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు సహకరించాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పాయింట్‌ల వారిగా వాహనాలు పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే విధంగా, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. గూడారాలు వేసే భక్తులు విద్యుత్ తీగలకు వైర్లువేసే అవకాశం లేకపోలేదు. అంటువంటి పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా కార్మికులతో చెత్తాచెదారం తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, భక్తులకు క్యూలైన్‌లో మంచినీటి ప్యాకెట్లు సరఫరా చేయాలన్నారు. క్షేత్రంపై మద్యపాన నిషేధం ఉంటుందని, ఎక్సైజ్ అధికారులు గుట్ట కమాన్ వద్ద నుంచే కాకుండా, కీసరగుట్ట పాదాల వద్ద కూడా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. దొంగతనాలు, ఇతర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, ఎప్పటికప్పుడు చెరువులను పర్యవేక్షించాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణీల కొరకు ప్రత్యేక దర్శన సౌకర్యంతో పాటు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా దర్శనం కొరకు ఆన్‌లైన్ సేవలు పొందేందుకు అదనపు కలెక్టర్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. సమావేశానికి ముందుగా క్యూలైన్లను, జాతర ఏర్పాట్లను పరిశీలించి, స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారులు, ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి, ఫౌండర్ మెంబర్స్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం

చౌదరిగూడ, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్ధుల జంగయ్య ఆరోపించారు. మంగళవారం తుమ్మలపల్లి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వమేర్పడి 14 నెలలు గడిచినా సంక్షేమ పథకాల అమలు కావడం లేదన్నారు. ఈ నెల 25న తుక్కుగూడలో నిర్వహించే సెమినార్‌కు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేష్, కృష్ణ, బాల్‌రాజ్, షబ్బీర్, అనంత, చిన్నయ్య, వీరేష్, రత్నయ్య, బాలమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

విద్యుత్, నీటి అంతరాయం లేకుండా చర్యలు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ సుధీర్, అధికారులు

వికారాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. వేసవిలో నీటిఎద్దడి రాకుండా చూడాలని హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షించారు. అర్హులందరికీ రైతుభరోసా పథకం అందించేలా చర్యలు చేపడుతున్నామని, రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ కార్డులందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సమస్య లేకుండా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్డీఏ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ అధికారి మోహన్‌బాబు, ట్రాన్స్‌కో ఎస్ఈ లీలావతి, మిషన్ భగీరథ జిల్లా అధికారి చలమారెడ్డి, మత్స్యశాఖ అధికారి వెంకయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకులు రుణ లక్ష్యాలను అధిగమించాలి

జిల్లాలోని అన్ని బ్యాంక్‌లు తమకు కేటాయించిన రుణ లక్ష్యాలను అధిగమించేలా కృషిచేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. కలెక్టరేట్‌లో 2025-26సంవత్సరానికి నాబార్డ్ రూపొందించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. నాబార్డ్ యేటా ప్రతి జిల్లాకు పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ రూపొందిస్తుందని, ప్రాధాన్యతా విభాగంలో జిల్లాలో భౌతిక, ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేసి, లీడ్ బ్యాంక్ అమలు చేయాల్సిన వార్షిక క్రెడిట్ ప్లాన్‌ను రూపొందిస్తుందన్నారు. పంట ఉత్పత్తి, నిర్వహణ మార్కెటింగ్ కోసం రూ.3872.65కోట్లు, వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు టర్మ్‌లోన్ రూ.1279.1కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయలకు రూ.150.02 కోట్లు, అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలకు రూ.331.28కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు రూ.608.48కోట్లు ఇతర ప్రా ధాన్యత రంగ రుణాలు(విద్య, హౌసింగ్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రెన్యూవబుల్ ఎనర్జీ మొదలైన వాటికి) 1190.97కోట్లు ఉందన్నారు. జిల్లాలో ప్రాధాన్యత రంగానికి నాబార్డు రూ.7432.51కోట్ల అంచనా వేసిందన్నారు. కార్యక్రమంలో డీడీఎం నాబార్డు అఖిల్ పున్నా, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, ఫిషరీస్ వెంకయ్య పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..
బయల్పడిన వినాయక విగ్రహం


బయటపడిన వినాయక విగ్రహం



తాండూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పొలాల్లో దున్నుతుండగా నాగలికి తగిలి విగ్రహాలు బయటపడటం సాధారణంగా జరుగుతుంటాయి. అయితే ఓ ఆంజనేయస్వామి ఆలయంలోని గోడలో వినాయక విగ్రహం బయల్పడింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలం చంద్రవంచ సమీప చంద్రవంచ-కరన్‌కోట్ రోడ్డులో పల్లెగూడ ఆంజనేయ స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో 40ఏళ్ల క్రితం నుంచి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో మూలన ఉన్న ఓ రాయికి చంద్రంపూసే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. రెండు రోజుల క్రితం పూజారి స్వామివారికి, అనంతరం రాతికి చంద్రం పూశాడు. చంద్రం పూస్తున్న క్రమంలో రాయి ఊడొవచ్చింది. ఆ రాయి వెంట విఘ్నేశ్వర విగ్రహం బయటికి వచ్చింది. ఈ విషయాన్ని పూజారి గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆంజనేయాలయంలో వినాయకుడి విగ్రహం బయటపడడం అద్భుతమని గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు.

24న లింగ ప్రతిష్ఠాపన: పల్లెగూడ ఆంజనేయస్వామి ఆలయానికి అగ్గనూరు అశోక్‌కుమార్, అగ్గనూరు శోభావతి కొంత భూమిని ఇచ్చారు. ఆ స్థలంలో జై భారత్ మాత సేవా సమితి న్యూఢిల్లీ గురుహవా మల్లినాథ్ మహరాజ్ నిరుగుడి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన లింగ ప్రతిష్ఠాపన చేస్తారని గ్రామస్తులు తెలిపారు.

ఇళ్ల స్థలాలకు పొజిషన్ చూపుతాం


వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్, పేదలు

కందుకూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కందుకూరులో గతంలో ఇండ్ల స్థలాలకు సర్టిఫికెట్లు ఇచ్చిన వారికి త్వరలోనే పొజిషన్ చూపుతామని ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్‌తో కలిసి లబ్ధిదారులు తమకు ప్లాట్ పొజిషన్ చూపాలని ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చారు. వారితో ఆర్డీవో మాట్లాడారు. కందుకూరు గ్రామ పరిధిలోని 788, 107 సర్వే నంబర్లలో గతంలో పేద లకు ఇండ్ల స్థలాల కోసం పట్టాలు ఇచ్చాని తెలిపారు. 788 సర్వే నంబర్ భూమిలో గుట్టలతో కూడిన పెద్దరాళ్లు ఉండడంతో వారికి పొజిషన్ చూపలేకపోయామని తెలిపారు. లబ్ధిదారుల విన్నపం మేరకు వారం రోజుల క్రితం రెండు సర్వే నంబర్లను డిప్యూటీ సర్వేయర్ క్రిష్ణయ్యతో సర్వే చేయించామని తెలిపారు. వినియోగ యోగ్యానికి ఎంత భూమి ఉందనే నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో త్వరలో పొజిషన్ చూపుతామన్నారు. కార్యక్రమంలో గుడిసెల పోరాట సంఘం అధ్యక్షుడు ఆర్.శేఖర్, సీఐటీయూ నాయకుడు గాదె సత్తయ్య, రాము లు, యాదయ్య, జంగయ్య, సక్కుబాయి, యదమ్మ, కవిత, పి.అరుణ, రాములు, గంగమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య

- దౌల్తాబాద్‌లో ఘటన
- 11ఏళ్లలోపు ముగ్గురు చిన్నారులు

దౌల్తాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్‌లో మంగళవారం జరిగింది. దౌల్తాబాద్‌కు చెందిన మహబూబ్(32), లతీఫా(28) భార్యాభర్తలు. మహబూబ్ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. వీరికి 11ఏళ్లలోపు పిల్లలు ఓ కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో చదువుతున్నారు. మంగళవారం ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న పిల్లలు ఇంటి తలుపులు మూసి ఉండటంతో బయటే కూర్చున్నారు. గమనించిన స్థానికులు అనుమానంతో కిటికీలోంచి చూడగా మహబూబ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని విగతజీవిగా కన్పించాడు. తలుపులు పగలగొట్టి చూడగా అక్కడే నేలపై లతీఫా మృతదేహం ఉంది. అయితే మహబూబ్ భార్యను చంపి అనంతరం ఆత్మహత్య చేసుకున్నట్టు స్థానికులు అనుమానించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి అక్కడికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చనిపోయిన భార్యాభర్తలకు సంబంధించి పిల్లలు తప్ప ఎవరూ అందుబాటులో లేరని, వారి మృతికి గల కారణాలను త్వరలోనే తెలుసుకుంటామని పోలీసులు తెలిపారు.



ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థినులు

వైవిధ్య రాష్ట్రాలు భారత్ గొప్పతనం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'ఈశాన్య భారతం, వైవిధ్య రాష్ట్రాలు మన దేశ గొప్పతనం అని, భిన్నత్వంలో ఏకత్వం దేశ సంస్కృతిని చాటుతుందని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్‌లోని యూనివర్సిటీలో 'నార్త్-ఈస్ట్ ఫెస్ట్'ను నిర్వహించారు. ఈశాన్య భారతం ప్రత్యేక సంస్కృతిని కలిగి ఉన్న ప్రాంతం అని కొనియాడారు. వారిజీవన విధానం ముచ్చటగొలుపుతుందని అన్నారు. ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దామోదర్, సాత్వికరెడ్డి, రవీందర్, శంకర్ లింగం, ప్రత్యూషరెడ్డి, ఫరీద్, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


నక్ష సర్వేను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్, సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి సుధీర్ గోలి

కొడంగల్‌లో నక్ష సర్వే ప్రారంభం

- భూ సంబంధిత వివాదాలకు చెక్

కొడంగల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నక్ష పైలెట్ సర్వేతో ఇళ్లు, భూ సంబంధిత వివాదాలకు చెక్ పడుతుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్, సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి సుధీర్‌గోలి అన్నారు. మంగళవారం కొడంగల్ శివారులోని తాండూరు రోడ్డులో హెలిప్యాడ్ వద్ద నక్ష సర్వేను అధికారులతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రెండు రోజులు కొనసాగే ఈ సర్వేలో వ్యవసాయ సాగు భూముల మాదిరిగానే మున్సిపాలిటీ లోనూ పక్కాగా సర్వే చేసి నక్ష రూపొందిస్తామని తెలిపారు. ఎవరి జాగా ఎంతో కచ్చితంగా తెలుస్తుందన్నారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని ఇళ్లు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాల సర్వేతో హద్దులు, విస్తీర్ణాన్ని డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్ చేస్తామని వివరించారు. నక్ష సర్వేకు కొడంగల్‌కు ప్రత్యేక హెలికాప్టర్‌ను తెప్పించామని తెలిపారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుధీర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులిక్కడ.. టీచర్ ఎక్కడ?

- ఉపాధ్యాయిని రాక సాగని చదువు


క్లాస్ రూంలో కూర్చున్న విద్యార్థులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు విద్యార్థులు ఆ పాఠశాల తరగతిలో ఉపాధ్యాయురాలి కోసం ఎదురుచూసినా ఆమె రాలేదు. దీంతో చిన్నారుల చదువు సాగడం లేదు. ఇది వారికి నిత్యకృత్యంగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం బోయగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సునీత స్కూలుకు రాక విద్యార్థులు ఊరికే కూర్చొని వెళ్తున్నారు. టీచర్ విధులకు రాకుంటే పిల్లలకు చదువెలా వస్తుందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. 'ఆ స్కూల్ టీచర్ రోజూ వస్తున్నట్టు మాకు చెబుతున్నారు. రావడం లేదా? అని ఎదురు ప్రశ్నించారు.

రోడ్డుకు అడ్డుగా ఉన్న నిర్మాణాల కూల్చివేత

శామీర్‌పేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాకపోకలు సాగించే రోడ్లకు అడ్డుగా ఉన్న 8 నిర్మాణాలకుగాను రెండింటిని మంగళవారం హైడ్రా కూల్చివేసింది. తూంకుంట మున్సిపాలిటీ పరిధి దేవరయంజాల్‌లోని 13వ వార్డులో ఎస్సీ కాలనీలో దళిత కుటుంబాలున్నాయి. వారు రాకపోకలు సాగించేందుకు ఎనిమిది చోట్ల రోడ్లను ఏర్పాటు చేశారు. అనంతరం వెలసిన తిరుమల కాలనీ వాసులు దళితులు రాకపోకలు సాగించే రోడ్లకు అడ్డుగా గోడలను, బేస్మెంట్లు కట్టారు. దీంతో కాలనీల వాసులు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. ఈ నిర్మాణాలను కూల్చాలని తెలంగాణ రాష్ట్ర దళిత సమాఖ్య అధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని హైడ్రా కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. రాకపోకలు సాగించేందుకు రోడ్లను క్లియర్ చేయాలని కమిషనర్‌కు మొరపెట్టుకున్నాడు. దీంతో రోడ్లకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను కూల్చారు. తిరుమల కాలనీ వాసులు కూల్చివేతలను అడ్డుకున్నా రెండు గోడలను కూల్చి రాకపోకలకు వీలు కల్పించారు. కూల్చివేతలకు రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక డిజాస్టర్ రెస్పాన్స్ వెహికిల్, రెండు టిప్పర్లను, 30మంది సిబ్బందిని వినియోగించారు. అయితే దళితులు రాకపోకలు సాగించే మిగతా ఆరు నిర్మాణాలూ కూల్చాలని కాలనీ వాసులు ఆందోళన చేశారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గేమింగ్ డెవలప్‌మెంట్‌పై నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఇన్‌టెల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ప్రొఫెసర్ మల్లికార్జున్ తెలిపారు. పోచారం పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం ఐఎస్‌టీఈ ఆధ్వర్యంలో గేమింగ్ క్లబ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వన్ డీ గేమింగ్ అభివృద్ధిని ఎలా చేయాలనే విషయాలను వివరించారు. సాంకేతిక అంశాలపై నేర్పించారు. అనంతరం గేమింగ్‌పై క్విజ్ నిర్వహించారు. 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మొయినాబాద్ పీఎస్‌లో వీరరాఘవరెడ్డి

- మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విచారించిన పోలీసులు
- రంగరాజన్‌పై దాడి ఘటనపై ప్రశ్నల వర్షం


పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిందితుడు వీరరాఘవరెడ్డి

మొయినాబాద్: ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్‌పైదాడి కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డిని కస్టడీకి తీసుకున్న పోలీసులు విచారణ చేపడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రశ్నించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పర్యవేక్షణలో మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి సమక్షంలో విచారణ చేపట్టారు. సీపీ కార్యాలయం నుంచి వచ్చిన ఓ అధికారి సైతం విచారణ సమయంలో అక్కడే ఉన్నారు. రాత్రి వరకు విచారణ కొనసాగింది. నిందితుడికి మధ్యాహ్న భోజనం స్టేషన్‌లోనే ఏర్పాటు చేశారు. పోలీసులు ముందుగా తయారు చేసుకున్న ప్రశ్నావళి ప్రకారం విచారణ కొనసాగించినట్లు తెలిసింది. మొదటి రోజు వీరరాఘవరెడ్డి బాల్యంతో పాటు అతని జీవన విధానం, విద్యాభ్యాసం, కుటుంబ నేపథ్యం, మానసిక పరిస్థితి, ఆర్థిక స్థితిగతుల గురించి విచారించినట్లు సమాచారం. చిలుకూరు ఆలయంలో జరిగిన సంఘటన గురించి కాకుండా అతని బాల్యంతో పాటు అనంతరం చేసిన కార్యక్రమాలు, జరిగిన సంఘటనల గురించి పోలీసులు ఆరా తీశారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు వీరరాఘవరెడ్డి సరైన సమాధానాలు చెప్పడం లేదని తెలిసింది. ఇంకా రెండు రోజుల పాటు విచారణ చేయనున్నారు. రంగరాజన్‌పై దాడి ఎందుకు చేశాడు. అతని ఉద్దేశం ఏమిటి..? ఒక్కడే చేశాడా..?, లేదా అతనికి సపోర్టుగా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసు దర్యాప్తు చేయనున్నారు. అయితే హిందూధర్మ పరిరక్షణ కోసమే తాను రామరాజ్యం సంస్థను ఏర్పాటు చేసినట్లు నిందితులు వీరరాఘవరెడ్డి పోలీసులకు సమాధానం చెప్పినట్లు తెలిసింది. తన సంస్థ కార్యకలాపాలు సజావుగా జరగాలంటే ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదని పూజారుల నుంచి ఆర్థిక సహకారం తీసుకోవాలని భావించాడని అందులో భాగంగానే చిలుకూరు వచ్చినట్లు తెలుసుంది.

రామరాజ్యం స్థాపనే లక్ష్యమంటూ..

రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి స్వస్థలం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలంలోని కొప్పవరం. ప్రస్తుతం మణికొండలో నివాసం ఉంటున్నాడు. గతంలో అతను సంగీతం టీచర్‌గా పని చేశాడు. పోలీసులు, కోర్టులు ధర్మస్థాపన కోసం పనిచేడం లేదనేది అతిని భావన. రామరాజ్య స్థాపన కోసం ఓ సంస్థ ఉండాలని భావించాడు. తనకు తాను ముక్కంటి అవతారంగా భావించాడు. 2022లో కోసలేంద్ర ట్రస్ట్ పేరిట రామరాజ్యం ఆర్మీని ఏర్పాటు చేశాడు. 20 ఏళ్ల మధ్య నుంచి 50 ఏళ్ల వయసున్న వారిని సభ్యులుగా చేర్చుకోవాలని నిర్ణయించాడు. తొలివిడతలో సుమారు 5వేల మందిని చేర్చుకోవాలని సోషల్‌మీడియాలో ప్రచారం చేశాడు. తన సంస్థలో చేరేందుకు 36 మంది దరఖాస్తు చేసుకోగా అందులోంచి 25 మందిని ఇదే సంవత్సరం జనవరిలో సభ్యులుగా చేర్చుకున్నాడు. ఎంపికైనవారికి నెలకు రూ.20 వేల జీతం ఇస్తానని చెప్పాడు. న్యాయవ్యవస్థను కొందరు నిర్లక్ష్యం చేసున్నారని సభ్యులకు వివరిస్తూ, తాము చేయాల్సిన కార్యక్రమాల గురించి వివరించేవాడు. ఇందుకు సంబంధించి ఏపీలో కొన్ని సమావేశాలు సైతం నిర్వహించాడు. సభ్యులందరికీ ప్రత్యేక యూనిఫాం ఉండాలని సూచించాడు. అయితే ముందుగా అనుకున్న ప్రకారం ఈనెల 7వ తేదీన సభ్యులందరితో కలిసి చిలుకూరు ఆలయానికి వెళ్లారు. తాము చెప్పినట్లు వినాలని, తనకు సహక రించాలని రంగరాజన్‌కు చెప్పారు. అందుకు ఆయన సహకరించకపోవడంతో దాడి చేశారు. వీరరాఘవరెడ్డి ఇదే తరహాలో నగరశివారులోని కొన్ని ఆలయాలకు వెళ్లి తమకు సహకరించాలని కోరాడు. అందుకు కొందరు సరే అనడంతో విషయం బయటకు రాలేదు.

చిలుకూరులో బెడిసికొట్టింది..

ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం వీరరాఘవరెడ్డి తన సభ్యులతో కలిసి చిలుకూరుకు వచ్చాడు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఇంట్లోకి వెళ్లారు. తనకు కొంత మందిని ఇవ్వాలని.. అదేవిధంగా ఆర్థికంగా సహకరించాలని డిమాండ్ చేశాడు. అయితే రంగరాజన్ అందరు అర్చకుల్లా కాకుండా.. తాను న్యాయబద్ధంగా ముందుకు వెళ్తానని చెప్పడంతో, అది జీర్ణించుకోలేని వీరరాఘవరెడ్డి అతనిపై దాడి చేశాడు.

నిజాయితీ గల మోసగాడు సీఎం రేవంత్

(ఐదో పేజీ తరువాయి)

బాకీ పడిందని కేటీఆర్ ఆరోపించారు. నాడు ప్రాజెక్టుల నిర్మాణం, సాగునీటి కల్పనతో పాలమూరుకే ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు వలస వచ్చారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాది తిరుగకముందే మళ్లీ పాతపరిస్థితులు మొదలయ్యాయన్నారు. ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, రైతులు, ప్రభుత్వ విధానాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రభుత్వంలో చలనం లేదని కేటీఆర్ మండిపడ్డారు.

పాలమూరుకు రేవంత్ చేసిందేమీలేదు : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

పాలమూరు బిడ్డనని పదే పదే చెప్పుకునే సీఎం రేవంత్ సొంతజిల్లాకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. విదేశాలతో పాటు 35 సార్లు ఢిల్లీకి వెళ్లి రావడానికి సమయం దొరికిన సీఎంకు 90 శాతం పనులు పూర్తైన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సందర్శించడానికి, మిగులు పనులు పూర్తి చేయించడానికి సమయం దొరకడం లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్, విపక్షాలను తిట్టడమే తప్ప 15 నెలల పాలనలో రేవంత్ ప్రజలకు చేసిందేమి లేదని మండిపడ్డారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మోసపూరిత కాంగ్రెస్ కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర మాజీమంత్రి సూదిని జైపాల్ రెడ్డి పేరుపెట్టారే తప్ప ఒక్క పైసా కేటాయించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 300 గురుకులాలను 1020కి పెంచి పేద పిల్లలకు ఉన్నత భవిష్యత్ కల్పిస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, గువ్వల బాల్‌రాజ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా విశ్వాసం కోల్పోయిందని, ఇక ఎంతో కాలం మనలేదన్నారు. సొంత నియోజకవర్గమైన కల్వకుర్తి నుంచే రేవంత్ రెడ్డి పతనం ప్రారంభమైందన్నారు.

రైతు దీక్షలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ లు వాణిదేవి, నవీన్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు, రాష్ట్ర ఫుడ్‌కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు గువ్వల బాల్‌రాజ్, మర్రిజనార్దన్ రెడ్డి, అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, బాల్క సుమన్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రజనిసాయిచంద్, బీఆర్ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డి, దశరథ్ నాయక్, జీవీఎల్ఎన్ రెడ్డి, గంప వెంకటేశ్, ఎడ్మ సత్యం, సీఎల్ శ్రీనివాస్ యాదవ్, నిర్మలశ్రీశైలం గౌడ్, అనురాధపత్యానాయక్, అర్జున్‌రావు, జైపాల్ రెడ్డి, నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, విజయ్‌గౌడ్,సయ్యద్ ఖలీల్, గోపాల్ నాయక్, టిప్పు సుల్తాన్, లాయక్‌అలీ, లచ్చిరామ్ నాయక్, సైదులు గౌడ్, సుభాష్ , సతీష్, చంద్రశేఖర్ రెడ్డి,శంకర్, లాలయ్యగౌడ్, భాస్కర్ రావు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం.....

ఆమనగల్లు పట్టణంలో రైతు దీక్షకు హాజరైన కేటీఆర్‌కు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆమనగల్లు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోస్టాఫీస్ నుంచి హైదరాబాద్- శ్రీశైలం జాతీయరహదారి మీదుగా మాడ్గుల రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు కేటీఆర్ వాహనాల కాన్వాయ్ కొనసాగింది. అదేవిధంగా కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని కేటీఆర్ సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికిప్రత్యేక పూజలు నిర్వహించారు.

కందుకూరులో...

కందుకూరు : ఆమనగల్లులో చేపట్టిన రైతు దీక్షకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కందుకూరులో ఆ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, రాజయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలు మంగళవారం ఉదయం 11:30గంటలకు మండల కేంద్రానికి చేరుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్, టి.ఇందిరదేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, జిల్లా నాయకులు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, కాకి దశరథ, సామ మహేందర్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎలుక మేఘనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్‌కు స్వాగతం పలికారు. సుమారు గంట పాటు హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిర్వహించిన భారీ ర్యాలీలో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం దెబ్బడగూడ గేటు వద్ద పార్టీ జెండాను ఎగరవేశారు. ర్యాలీలో దొంగలు చేతివాటం చూపారు. మురళీనగర్‌కు చెందిన బాల్‌రాజ్ పాయింట్ జేబులో రూ.25వేలు దొంగిలించారు.



శివారు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఇటీవల నియమాకం చేసిన ప్రత్యేకాధికారులను తొలగించి వారి స్థానంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులను నియమించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ మంగతయారు, గుండ్లపోచంపల్లికి జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ ఎన్.యాదగిరిరావు, బోడుప్పల్‌కు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ ఎస్.పంకజ, పోచారానికి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఓఎస్డీ విద్యాధర్, పీర్జాదిగూడకు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సత్యనారాయణ, నార్సింగికి ఎంఆర్‌డీసీఎల్ ఈడీ శ్రీనివాస్‌రెడ్డి, శంషాబాద్‌కు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ గీతా రాధిక, శంకర్‌పల్లికి జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సామ్రాట్ అశోక్, జల్పల్లికి జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ నళిని పద్మావతి, సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌నకు జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ వాణిశ్రీ, సంగారెడ్డి జిల్లా బొల్లారానికి జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డిలను నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

వికారాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ యూనియన్(ఎఫ్‌పీఎస్‌టీ) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫిజికల్ సైన్స్ ఆన్‌లైన్ టాలెంట్ టెస్ట్ నిర్వహించగా వికారాబాద్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వికారాబాద్ సంకల్ప్ స్కూల్‌లో స్టేట్ లెవెల్ ఫిజికల్ సైన్స్ ఆన్‌లైన్ టాలెంట్ టెస్ట్ మంగళవారం వికారాబాద్‌లోని సంకల్ప్ విద్యాపీఠం స్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో హర్షిత్ ఆదిలాబాద్ మొదటి స్థానం, నక్క విష్ణువర్ధన్(మహబూబ్‌నగర్ రెండో స్థానం), వర్షిత్‌రెడ్డి వికారాబాద్ మూడో స్థానం దక్కించుకున్నారు. జిల్లా పరీక్షల్లో అబూ బాకర్(ధారూరు) మొదటి స్థానం, వర్షిత్‌రెడ్డి (వికారాబాద్), రెండో స్థానం, శ్రీకాంత్(దోమ), పవన్(దోమ) 3, 4వ స్థానాలు సాధించారు. వీరిని రిటైర్డ్ ప్రొఫెసర్ ముత్తారెడ్డి, ఎఫ్‌పీటీఎస్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ కమాల్‌రెడ్డి గైడ్ టీచర్స్, తోటి విద్యార్థులు అభినందించారు.

రైతు దీక్షల పేరుతో కేటీఆర్ చిల్లర రాజకీయాలు

- విషం కక్కుతున్న మాజీ మంత్రి
- పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతు దీక్షల పేరుతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుట్ర రాజకీయాలు చేస్తున్నారని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడమే కేటీఆర్ దినచర్యలో భాగంగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఆమనగల్లులోని మార్కెట్ యార్డ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధిని అడ్డుకోవడమే కేటీఆర్ పనిగా పెట్టుకున్నారని, ప్రభుత్వాన్ని అస్థిరపర్చే కుట్ర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. అభివృద్ధిపై కేటీఆర్, వారి పార్టీ నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. వెల్దండ, మాడ్గులలో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు వేల ఎకరాల భూములు కొన్నారని అందుకే మాడ్గులకు పెద్ద రోడ్డు వేస్తున్నారంటూ కేటీఆర్ ఆరోపించడం ఆయన కుట్ర రాజకీయాలకు, అక్కసుకు నిదర్శనమన్నారు. వేల ఎకరాలు ఎక్కడున్నాయో చూపాలని, లేకుంటే రేవంత్‌రెడ్డి కుటుంబానికి క్షమాపణ చెప్పాలన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలే రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. ప్రజల తిరస్కారంతోనే కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు పరిమితమయ్యారని, ఆయనకు ప్రజాసమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలు కల్వకుర్తికి వివిధ పథకాల కింద ఇప్పటికే రూ.వెయ్యి కోట్లు వెచ్చించారన్నారు. ఆమనగల్లు రైతు దీక్షకు రైతులే రాలేదని, బీఆర్ఎస్ నాయకులతో మమ అన్పించారని విమర్శించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, బిచ్యానాయక్, పి.మానయ్య, మాజీ ఎంపీపీ ధనుంజయ, నాయకులు వెంకటేశ్, ఖలీల్, అప్పం శ్రీను, శివలింగం, అలీం, ఖాదర్, కరీం, ప్రసాద్, ఖాదర్ ఖాద్రీ, విజయ్, మల్లయ్య, పాండురంగయ్య, శ్రీశైలం, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబీకుల ఉదారత

అనాథాశ్రమానికి విరాళం అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మండలం బుల్కాపురానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఈ నెల 6న రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని ఆయన స్నేహితులు అన్నారు. 2018 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ స్నేహితులు శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.1,10,100 జమచేశారు. ఆ డబ్బును శ్రీనివాస్ కుటుంబీకులకు ఇచ్చేందుకు వెళ్లగా వారు నిరాకరించి.. ఈ సాయాన్ని ఏదైనా అనాథాశ్రమానికి ఇవ్వాలని కోరారు. వారి సమక్షంలోనే మంగళవారం వికారాబాద్ పట్టణ పరిధి ధన్నారంలో గల యజ్ఞ ఫౌండేషన్ వివేకానంద గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉజ్వల్ రాజ్‌కు డబ్బులను అందజేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. శ్రీనివాస్ కుటుంబసభ్యులు ఉదారతను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ సోదరుడు బుచ్చిరాజ్, 2018బ్యాచ్ కానిస్టేబుళ్లు శ్రీశైలం, ప్రేమ్‌సాయి, రాజ్‌కుమార్, మహేశ్ పాల్గొన్నారు.

మారెపల్లిలో సుద్ద మాఫియా

- భారీగా అక్రమ తవ్వకాలు
- సుద్ద డంప్‌లను గుర్తించిన మైన్స్, రెవెన్యూ అధికారులు
- సీజ్ చేసినా చర్యలు శూన్యమని గ్రామస్తుల ఫిర్యాదు


అర్ధరాత్రి సుద్ద డంప్‌లను గుర్తించిన అధికారులు

తాండూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):పెద్దేముల్ మండలం మారెపల్లిలో లభించే సుద్ద(బెంటోనైట్) కు ప్రపంచ మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉండటంతో అక్రమార్కులు భారీగా తవ్వకాలు జరపుతున్నారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకోకుండా మారెపల్లిలో తవ్వకాలు జరిపేందుకు సంతకాల సేకరణ చేపట్టారు. ఇక్కడి నాణ్యమైన సుద్దను విదేశాలకు ఎగుమతి చేసేందుకు కంపెనీలు పోటీపడుతున్నాయి. సుద్ద గనులను ఎక్కవగా లీజుకివ్వకపోవడంతో అక్రమ మైనింగ్ జోరు పెరిగింది. పర్మిషన్ ఒకచోట పొంది మరోచోట తవ్వకాలు చేస్తున్నారు. మారెపల్లి సర్వే నం:39 భూమిలో అనుమతిపొందిన దానికంటే 22గుంటల్లో అదనంగా సుద్ద తవ్వినట్లు అధికారులు తేల్చారు. సర్వే నంబర్ 39/ఎ1లో 8 గుంటలు, సర్వే నంబర్ 39/ఎ2లో 9గుంటల్లో అక్రమంగా తవ్వారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు జమాలుద్దీన్ నాయకత్వంలో సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అక్రమాలపై గతంలోనూ ఫిర్యాదులు చేశామని తెలిపారు. సుద్దను సీజ్ చేసినా రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు. అధికారులు నామమాత్ర జరిమానాలతో సరిపెడుతున్నారు. సుద్దమాఫియా, అక్కడి సిండికేట్ సభ్యులు అధికారుల దాడులు జరగకుండా చూస్తున్నారు. కాగా సుద్ద భూములు కలిగిన రైతులు లీజుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వానికి రాయల్టీ కట్టాల్సి వస్తుందని అక్రమ తవ్వకాలకే మొగ్గు చూపుతున్నారు. రాత్రిపూట సుద్ద తవ్వి ఓపెన్ ప్లాట్లలో ఆరబోస్తున్నారు. అధికారులు పట్టుకుంటేనే అక్రమాలు బయటపడుతున్నాయి. మైన్స్ శాఖలో సిబ్బంది సరిపడా లేక తనిఖీలు చేయడం లేదనే వాదనా వస్తోంది. అక్రమార్కులకు ఇది అవకాశంగా మారింది. ఇదిలా ఉంటే సుద్ద అక్రమ రవాణా, తవ్వకాలను నివారించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

షోకాజ్ నోటీసులిచ్చాం



సుద్ద అక్రమ తవ్వకందారులను గుర్తించాం. అక్రమార్కులకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. లీజు పర్మిట్ లేకుండా సుద్ద తవ్వకం జరిపితే తవ్విన వైశాల్యాన్ని బట్టి రూ.2కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు తవ్వకాలపై పంచనామా రిపోర్టును అందజేశారు. సుద్ద అక్రమ తవ్వకంపై నిఘా పెంచాం.

- సత్యనారాయణ, ఏడీ, మైన్స్

వైభవంగా ఊరడమ్మ జాతర



బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పెద్దేముల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖానాపూర్ గ్రామంలో ఊరడమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు పిండి వంటలు చేసి బోనాలతో అమ్మవారికి గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఊరూవాడా సల్లంగా ఉండాలని మొక్కుకున్నారు. పాడి పంట బాగుండాలని వేడుకున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ హరిప్రియ

పరిగి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గల అనంతరెడ్డినగర్‌లోని శ్రీభ్రమరాంభమల్లికార్జునస్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం శివపార్వతుల కల్యాణ ఉత్సవాన్ని నిర్వహించారు. పరిగితో పాటు, పరిగి గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. పరిగి మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బి.హరిప్రియప్రవీణ్‌రెడ్డి కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

శామీర్‌పేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆలయం తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా, శామీర్‌పేటలోని జైమాతాజీ కిరాణ జనరల్ స్టోర్ ఆధ్వర్యంలో 25కేజీ బియ్యం అందజేశారు. తూంకుంటకు చెందిన నర్సింహ, వారి కుటుంబ సభ్యులు అన్నదానికి సహకరించారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర

కులకచర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామం నుంచి శివస్వాములు మంగళవారం పాదయాత్రగా శ్రీశైలానికి బయల్దేరి వెళ్లారు. స్థానిక హనుమాన్ ఆలయంలో ఇరుముడులు ధరించి శివనామస్మరణతో బయల్దేరి వెళ్లారు. శివస్వాములతో పాటు గ్రామస్థులు కూడా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లారు.

పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను అంతం చేసి పాత పెన్షన్ వచ్చే వరకూ నిరంతర పోరాటం చేయాలని టీజీసీపీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతికుమార్ అన్నారు. కొడంగల్‌లో జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో భోజన విరామ సమయంలో సోమవారం తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా సంఘటితంగా ఉద్యమించి పాత పెన్షన్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కాస్తులో ఉన్న భూములు మాకే చెందాలి'

కులకచర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాస్తులో ఉన్న భూములు మాకే చెందాలని కులకచర్లకు చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కులకచర్లకు చెందిన రైతులు శివ్వని వెంకట్, రాములు, వెంకప్ప, మన్యమయ్య, బసప్పకు సర్వే నెం.699లో నాలుగు ఎకరాల భూమి ఉంది. పూర్వీకుల నుంచి కాస్తులో ఉన్నారు. కానీ ఇతరులకు కట్టడాలకు అనుమతి ఇస్తున్నారని తెలిపారు. కాస్తులో ఉన్నామని ఇట్టి భూమి తమకే చెందాలని తెలిపారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలి

పరిగి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పరిగి ఎంఈవో గోపాల్ సూచించారు. పట్టణంలోని న్యూబ్రిల్లియంట్ స్కూల్‌లో మంగళవారం టెన్త్ విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ జేవీడీ ప్రసాద్, సురేష్, బాలు పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన ఇంటర్నల్ మార్కులను ఎంఈవో హరిలాల్, చౌదర్‌పల్లి జీహెచ్‌ఎం రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, శివకుమార్, అప్పల నాయకుడు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ

దౌల్తాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకఫస్లాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ నాయకుడు కోట్ల హనుమంతు ముదిరాజ్ మంగళవారం పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన టూ వీలర్స్ లాంచ్



మేడ్చల్‌లో మంగళవారం సౌమ్య ఆటోమొబైల్స్ షోరూంలో కస్టమర్ మీట్ కార్యక్రమాన్ని సౌమ్య ఆటోమొబైల్స్ అధినేత చిట్ల సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హోండా కంపెనీ మార్కెట్‌లోకి కొత్తగా విడుదల చేసిన టూ వీలర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కొత్త మోడళ్లు ఆధునిక సాంకేతిక కలిగి ఉన్నాయని, ఉత్తమ మైలేజ్ ఇస్తాయని ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు తెలిపారు.

- మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి)

చికెన్ దుకాణాలు వెలవెల

- హోటళ్లలో అదే పరిస్థితి
- బర్డ్‌ఫ్లూతో తగ్గిన వ్యాపారం
- ఆందోళనలో వ్యాపారులు



గిరాకీ లేక ఖాళీగా కూర్చున్న చికెన్ సెంటర్ యజమాని



గిరాకీ లేక బోసిపోయిన చికెన్ బిర్యానీ హోటల్

మర్పల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ కారణంగా ప్రజలు చికెన్ తినేందుకు జంకుతున్నారు. దీంతో పదిరోజుల వ్యవధిలో చికెన్ ధరలు అమాంతంగా పడిపోవడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ రోజు కళకళలాడే బిర్యానీ హోటళ్లు గిరాకీ లేక వెలవెలబోతున్నాయి. కొద్ది రోజులుగా కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిందని వార్తలు రావడంతో చికెన్ కొనేందుకు ప్రజలు ఆసక్తి కనబర్చడం లేదు. బర్డ్‌ఫ్లూ వైరస్ కారణంగా కోళ్ల ఫాం యజమానులు, చికెన్ సెంటర్లు, బిర్యానీ హోటళ్లకు నష్టం వాటిల్లుతోంది. మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ చికెన్ బిర్యానీ హోటల్‌లో ప్రతీ రోజు క్వింటాలుకు పైగా చికెన్ బిర్యానీ విక్రయించేవారు. బర్డ్‌ఫ్లూ కారణంగా కనీసం పది కిలోల చికెన్ బిర్యానీ అయినా విక్రయం కావడం లేదని వ్యాపారులు వాపోయారు. నిత్యం వందలాది మందితో కళకళలాడే హోటళ్లు బర్డ్‌ఫ్లూ భయంతో బోసిపోతున్నాయి. అదేవిధంగా మర్పల్లి మండలంతో పాటు వివిధ గ్రామాల్లో దాదాపు వందలాది సంఖ్యలో చికెన్ సెంటర్లు ఉన్నాయి. క్వింటాళ్ల మేర చికెన్ విక్రయించే వ్యాపారులు బర్డ్‌ఫ్లూ కారణంగా వ్యాపారం దెబ్బతిన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వైరస్ ఇదే విధంగా ఉంటే తాము పూట గడిపే పరిస్థితి కూడా లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు క్వింటాళ్ల చికెన్ విక్రయించేవాళ్లం



నిత్యం క్వింటాలు నుంచి రెండు క్వింటాళ్ల వరకు చికెన్ విక్రయాలు జరిగేవి. రోజుకు రూ.1000 నుంచి రూ.2000 వరకు ఆదాయం ఉండేది. బర్డ్‌ఫ్లూ కారణంగా ప్రజలు ఆసక్తి కనబర్చడం లేదు. కనీసం పది కిలోల చికెన్‌ను కూడా విక్రయించడం లేదు.

- పవన్, చికెన్ సెంటర్ యజమాని

క్వింటాలు చికెన్ బిర్యానీ విక్రయించేవాళ్లం



నిత్యం క్వింటాల్ చికెన్ బిర్యానీ విక్రయించేవాళ్లం. బర్డ్‌ఫ్లూ కారణంగా రోజూ కనీసం పది కిలోల చికెన్ బిర్యానీ అయినా విక్రయం జరగడం లేదు. గిరాకీ లేకపోవడంతో వండిన చికెన్ బిర్యానీని పడేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో చికెన్ బిర్యానీ ప్లేట్ రూ.120కి విక్రయించేవాళ్లం. ప్రస్తుతం ప్లేట్ రూ.100కు విక్రయిస్తున్నా ప్రజలు ఆసక్తి కనబర్చడం లేదు.

- ఖాసీం, ప్రిన్స్ హోటల్ యజమాని, మర్పల్లి

చకచకా రోడ్డు పనులు



సిరిగిరిపేట్ వద్ద పనులను పరిశీలిస్తున్న డీఈఈ

తాండూరు రూరల్, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోడ్లపనులు చకచకా కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని తాండూరు-చించోళి రోడ్డు మార్గంలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి సిరిగిరిపేట్ వరకు మూడు కిలో మీటర్ల మేరకు రోడ్డును వేస్తున్నారు. ఇట్టి రోడ్డు పనులు దాదాపు పూర్తి కావచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం డీఈఈ నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, గోవింద్, నరేష్ తదితరులు పనులను పరిశీలించారు. రెండేళ్లుగా గ్రామంలో రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజల ఇబ్బందులు తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పీడబ్ల్యూడీ నుంచి సిరిగిరిపేట్ వరకు ఎంఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.39.8లక్షల నిధులు కేటాయించారని తెలిపారు. అట్టి నిధులతో రోడ్డు పనులు పూర్తవుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న సీసీరోడ్డు పనులు

కులకచర్ల: కులకచర్లలో డబుల్ సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి మాట్లాడుతూ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరవతో నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డుకు మధ్యలో హైమాస్ట్ లైట్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి బ్లాక్ బీ అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ఆనందం, ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి

మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి

బషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నర్సరీలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని బషీరాబాద్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి వై.వెంకటేష్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని మైల్వార్, కంసాన్‌పల్లి(బి) గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఆయా పంచాయతీల్లో ప్రజాసమస్యలపై కార్యదర్శులను ఆరాతీశారు. రికార్డులు పరిశీలిస్తూ నీటిసమస్యలు ఎమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. వన నర్సరీలను పరిశీలించి మొక్కల ఎదుగుదలకు తీసుకుంటున్న చర్యలపై కార్యదర్శులతో చర్చించారు. వేసవి దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు.

వార్డులకు ప్రత్యేకాధికారులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పురపాలిక పాలకవర్గం పదవీకాలం గత నెల 26న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో జనవరి 27 నుంచి అధికారుల ప్రత్యేక పాలన మొదలైంది. కొడంగల్ పురపాలిక ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ సుధీర్ బాధ్యతలను స్వీకరించారు. పట్టణంలో పాలనాపరంగా ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు 12 వార్డులకు ప్రత్యేకాధికారులను నియమించారు. కాలనీల్లో సమస్యలపై నేరుగా వార్డు అధికారులకు ఫోన్ చేయొచ్చు. కాలనీల్లో ఇంటింటికీ చెత్త సేకరణ జరగకున్నా, వీధి దీపాలు వెలగకున్నా, పారిశుధ్య పనులు చేయకున్నా వార్డు అధికారులకు ఫోన్ చేయవచ్చు. వారి సమస్య పరిష్కారానికి సిబ్బందిని పంపిస్తారు. ఒకటో వార్డు ప్రత్యేకాధికారి పి.భాస్కర్ (సెల్: 8978222248), రెండో వార్డు జి.దేవయ్య (9010948117), మూడో వార్డు ఎన్.ప్రవీణ్‌కుమార్ (9640022905), నాల్గో వార్డు జి.నవీన్ (9848920095), ఐదో వార్డు రాములు (9866324295), ఆరో వార్డు కేఎన్.రమేశ్ (6301480881), ఏడో వార్డు ప్రత్యేకాధికారి జగతి రాములు (9390129085), ఎనిమిదో వార్డు ఎన్.ప్రభాకర్ (8179994803), తొమ్మిదో వార్డు ఎర్ర రాములు (9381678714), పదో వార్డు పి.బుగ్గన్న (8125310766), 11వ వార్డు కె.సత్యనారాయణ (9959626780), 12వ వార్డు ప్రత్యేకాధికారి కె.కిష్టయ్యను (9440961753) సంప్రదించవచ్చు.

శివాజీ శోభాయాత్రకు భారీ ఏర్పాట్లు

తాండూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శివాజీ మహారాజ్ 395వ జయంతిని పురస్కరించుకొని తాండూరులో భారీ శోభాయాత్ర నిర్వహించనున్నారు. బుధవారం (నేడు) సాయంత్రం 3 గంటలకు శాంత్‌మాల్ చౌరస్తాలోని కాళికాదేవి మందిరం నుంచి చత్రపతి శివాజీ శోభయాత్ర నిర్వహించేందుకు బజరంగదళ్, హిందూ ఉత్సవ కేంద్ర సమితి, హింధూ వాహిని ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలో ప్రధాన వీధుల గుండా ఈ శోభాయాత్ర ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కాషాయ జెండాలతో పట్టణాన్ని అలకరించారు.

మల్కాపూర్‌లో నేడు విగ్రహావిష్కరణ

తాండూరు రూరల్: మల్కాపూర్‌లో నేడు(బుధవారం) నిర్వహించనున్న చత్రపతి శివాజీ విగ్రహం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చత్రపతి శివాజీ మహరాజ్ 395వ జయంతిని పురస్కరించుకుని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు శ్రీచత్రపతి శివాజీ మహరాజ్ యువజన సంఘం సభ్యులు తెలిపారు. ఈ విగ్రహాన్ని ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు గ్రామస్తులు రాఘవేందర్ తదితరులు తెలిపారు.

మరాఠా యోధుడికి రావిపత్ర నివాళి



దౌల్తాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మరాఠా యోధుడు చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలం యాంకి గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ సున్నపు అశోక్ రావి ఆకుపై చత్రపతి శివాజీ చిత్రాన్ని చిత్రీకరించాడు. తన చిత్రకళతో ఘననివాళి అర్పిస్తూ మరాఠా యోధుడిపై తన అభిమాన్ని చాటుకున్నాడు.

దండిగా 'ఉపాధి'

(5వ పేజీ తరువాయి)

పనులు చేపట్టడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 6,612 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఈనెలాఖరు వరకు ఉపాధి హామీ పనుల్లో వేగం పెరిగేందుకు కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 67 లక్షల పని రోజులు పూర్తి చేయాలన్న లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 59.45 లక్షల పనిరోజులు పూర్తి చేశారు. మార్చి నెలాఖరు వరకు ఇంకా 7.55 లక్షల పని రోజులు పూర్తి చేయాల్సి ఉంది. ఉపాధి హామీ పనులకు 45 రోజుల పాటు ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా ప్రోత్సహించి జిల్లాకు నిర్దేశించిన ఉపాధి పనిరోజుల లక్ష్యం అధిగమించాలనే ఉద్దేశంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మహిళలే క్రియాశీలకం!

జిల్లాలో ఉపాధిహామీ పనుల్లో మహిళా కూలీలే క్రియాశీలకంగా ఉంటున్నారు. జిల్లాలో 2,43,714 మంది కూలీలు ఉపాధి పనుల్లో చురుకుగా పాల్గొంటుండగా, వారిలో 1,25,701 మంది మహిళా కూలీలే ఉండడం విశేషం. ప్రస్తుతం ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీల్లోనూ మహిళలే అధికంగా ఉండడం విశేషం. ఉపాధి అడిగిన కూలీలందరికీ పని కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం హాజరవుతున్న కూలీల సంఖ్యను పెంచడానికి పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి కల్పించనున్నారు. సాగు భూముల్లో కందకాల తవ్వకం, పొలాలకు వెళ్లే బాటలో రోడ్ల నిర్మాణం, తోటల పెంపకం, హరితహారంలో మొక్కలు నాటడం, పశువులు, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణం, ఇంకుడు గుంతల నిర్మాణం పనులు చేపట్టనున్నారు. ఈ పనులే కాకుండా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉపాధి పనులు చేపట్టనున్నారు.

వసతుల కల్పన ముఖ్యం

మండుటెండల్లో ఉపాధి పనులు చేపట్టడం కూలీలకు చాలా ఇబ్బందికరంగా మారుతోంది. వేసవిలో ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఎండల కారణంగా ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులకు హాజరయ్యే కూలీలు సేదతీరేందుకు వీలుగా నీడ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇందుకోసం టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి వసతి కల్పించాల్సి ఉంటుంది. పని జరిగే ప్రదేశంలో కూలీలకు నీడ, తాగునీటి సదుపాయం కల్పించే బాధ్యత గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం అప్పగించింది. పనులు జరిగే ప్రదేశాల్లో నీడ, తాగునీటి వసతి, వైద్య సహాయం కల్పించేలా చర్యలు తీసుకుంటేనే ఉపాధి పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ఆలయ పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్

తాండూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీతారాంపేట్ హనుమాన్ ఆలయ పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఈవో నరేందర్ తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదలైన 20రోజుల్లో పాలకవర్గం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తులను రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ దేవాదాయ, ధర్మదాయ శాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కులకచర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాంరెడ్డిపల్లిలో నాలుగు రోజుల కిందట ప్రమాదవశాత్తు కుమ్మరి ముత్యాలమ్మ ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ సునంద బుగ్గన్న యాదవ్ బాధిత కుటుంబానికి మంగళవారం 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.5వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డి ఉన్నారు.

కోట్‌పల్లి: జిన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఉప్పిల్ల కిష్టయ్య అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న కోట్‌పల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ వారి కుటుంబానికి రూ.5వేలు అందజేశారు.

నాగారంలో స్క్రాప్ వేలం

కీసర రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీలో పేరుకుపోయిన స్ర్కాప్‌ను ఈనెల 21వ తేదీన వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు కమిషనర్ నాగారం మున్సిపల్ పేరున రూ.1.50లక్షల డీడీని తీసి 22న మున్సిపల్ మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్(ఫైల్)

కీసర రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దమ్మాయిగూడ మున్సిపాలిటీ చీర్యాలకు చెందిన ప్రవీణ్(28) మెడికల్ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. డిస్ట్రిబ్యూటర్‌తో పాటు మెడికల్ షాపును కొనసాగిస్తున్నాడు. కాగా నూతనంగా బహుళ అంతస్థుల భవనం నిర్మించాడు. ఇంటి కొరకు అప్పులు చేయడం, ఆశించిన స్థాయిలో వ్యాపారం జరగకపోవటంతో తీవ్ర ఆర్థిక సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో కుంగిపోయిన అతడు సోమవారం అర్థరాత్రి పెంట్‌హౌస్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కింది అంతస్తులో ఉన్న కుటుంబసభ్యులు పైకివెళ్లి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వికారాబాద్‌లో కారు బీభత్సం



బీభత్సం సృష్టించిన ఇన్నోవా కారు

వికారాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారు నడిపిన ఓ వ్యక్తి బీభత్సం సృష్టించారు. వికారాబాద్ ఎన్నెపల్లి చౌరస్తాలో మంగళవారం రాత్రి ఇన్నోవా క్రిస్టా కారులో అతివేగంగా వస్తున్న వ్యక్తి మసీదు బోర్డును ఢీకొట్టి, ఆ తరువాత ముందుగా వెళుతున్న మరో కారును ఢీకొట్టాడు. అంతటితో ఆగకుండా కొద్ది దూరం వెళ్లాక అదుపు తప్పి చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కారులో ఉన్న వ్యక్తిని ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాద సమయంలో కారు బెలూన్స్ ఓపెన్ కావ్వడంతో ప్రాణపాయం తప్పినట్లు తెలుస్తోంది. అయితే ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చెరువులో గల్లంతైన పొలసంతల బాలు మృతదేహం మంగళవారం లభ్యమైంది. ఈ సంఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పొన్నాల్ గండిచిత్తారమ్మ చెరువులో ఇద్దరు యువకులు గల్లంతైన విషయం తెలిసిందే. గల్లంతైన వారిలో ఆదివారం సందీప్‌సాగర్ మృతదేహం లభ్యం కాగా బాలు మృతదేహం మంగళవారం చెరువులో తేలియాడుతుండగా గుర్తించి వెలికితీశారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ చోరీ కేసులో ఇద్దరు నిందితులను జీనోమ్ వ్యాలీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తుర్కపల్లికి చెందిన హరికృష్ణ తుర్కపల్లిలోని భారత్ బయోటెక్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజువారీ లాగే పనినిమిత్తం కంపెనీలో వెళ్లి విధులు ముగించుకుని నడుచుకుంటూ ఫోన్ మాట్లాడుకుంటూ ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఫోన్ లాక్కొని పారిపోయారు. దీంతో హరికృష్ణ జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ వెంకటరెడ్డి నేతృత్వంలో విచారణ చేపట్టిన పోలీసులు నిందితులు తుర్కపల్లికి చెందిన టాగూర్ (22), శ్రీశైలం (24)గా గుర్తించారు. వారి వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అమాయక రైతులను ఆసరాగా చేసుకొని రియల్టర్ల మోసం

కులకచర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్లకు చెందిన రైతు మాసాగాళ్ల చంద్రయ్యను కొందరు రియల్టర్లు మోసం చేశారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామపరిధిలో సర్వే నెం.440/2లో 20 గుంటల భూమి, 450/3లో 20 గుంటల భూమి ఉంది. అతడి అవసరాల కోసం భూమి తాకట్టు పెట్టి అప్పు ఇప్పించాలని అదేగ్రామానికి చెందిన బసప్పను ఆశ్రయించాడు. తనకు తెలిసిన వారు ఉన్నారని చౌదరిగూడెం మండలం పద్మారం గణేశ్, గాలిగూడెం నరేశ్‌ను పరిచయం చేశాడు. షాద్‌నగర్‌కు చెందిన ఫైనాన్స్ వ్యాపారి మల్లేశ్‌కు 2024 మార్చి 2న సెల్‌డీడ్ ద్వారా చంద్రయ్య భూమి 440/2లోని 20గుంటలను విక్రయించారు. మల్లేశ్ రూ.5లక్షలు ఇవ్వగా చంద్రయ్యకు రూ.2లక్షలా 7వేలు మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులు ముగ్గురు గణేశ్, నరేశ్, బసప్పలు పంచుకున్నారు. భూమి విక్రయించినట్లు బాధితుడు ఆలస్యంగా తెలుసుకున్నాడు. రూ.2లక్షలా 7వేలు ఇచ్చి రూ.2లక్షలా 93వేలు ముగ్గురు కాజేసినట్లు గమనించాడు. తనకు న్యాయం చేయాలని గత నెలరోజుల నుంచికులకచర్ల పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, కనీసం ఫిర్యాదు తీసుకోలేదని బాధితుడు వాపోయాడు. ఈ విషయమై ఎస్ఐ అన్వేష్‌రెడ్డిని వివరణ కోరగా పద్మారాం, గణేశ్‌తో మాట్లాడానని తెలిపారు. తీసుకున్న డబ్బులు ఇచ్చి భూమి తిరిగి రిజిస్ట్రేషన్ చేయిస్తామని తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇంట్లో అగ్ని ప్రమాదం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపూర్ గ్రామంలోని ఓఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని బీసీవాడకు చెందిన కోటకొండ లక్ష్మణ్, కుటుంబసభ్యులు మంగళవారం మధ్యాహ్నం పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రమాదవశాత్తు ఇంటిపైకప్పునకు నిప్పంటుకుంది. దీంతో ఇంటిపైకప్పు దూలాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంట్లో వస్తువులు బీరువా, దుస్తులు, కుట్టుమిషన్, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.5లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు లక్ష్మణ్ వాపోయాడు.

బైక్ దొంగ రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బైక్ దొంగను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. క్రైం సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మేడపాటి నగర్‌కు చెందిన యశ్వంత్‌రెడ్డి తన బైక్‌ను ఘట్‌కేసర్‌లోని గిర్వాణి ఆస్పత్రి ఎదుట పార్కింగ్ చేయగా గుర్తుతెలియని దుండగుడు అపహరించుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టి పోలీసులు ఘట్‌కేసర్ నుంచి కొండపూర్‌కు అనుమానాస్పదంగా బైక్‌పై వస్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం, పాతపాలెం, నీలహాలి, చాకలివీధికి చెందిన వడ్డె రాజు బైక్‌ను చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు రాజును అదుపులోకి తీసుకుని విచారణ జరిపి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు క్రైం సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

చౌడాపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చౌడాపూర్‌లో నర్సింహులుకు చెందిన ఇంటికి రంగులు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి అగిర్యాల గ్రామానికి చెందిన రమేశ్ అనే వ్యక్తికి రెండు చేతులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.